క్లుప్తంగా

నేడు వేలం పాట

తలకొండపల్లి: మండలంలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట మల్లిఖార్జునస్వామి ఆలయ శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మాకం పాండయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25న ఆదివారం ఉ. 10 గంటలకు కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర, తలనీలాలు, కూల్ డ్రింక్స్, తదితర వాటికి వేలం పాట ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల వ్యాపారస్తులు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి చేయూత



సిమెంట్ అందజేస్తున్న ఉప్పల ట్రస్ట్ సభ్యులు

కడ్తాల్: మండల పరిధిలోని గానుగుమార్లతండాలో నిర్మిస్తున్న తుల్జాభవాని ఆలయ నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఈ మేరకు శనివారం ఆలయ స్లాబ్ నిర్మాణ నిమిత్తం 50 సంచుల సిమెంట్‌ను ట్రస్ట్ సభ్యులు, ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన ట్రస్ట్ చైర్మన్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, రాజునాయక్, రూప్‌సింగ్, శ్రీను, జాన్య, బాలు, సక్రునాయక్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభించిన నర్మద

మంచాల: మండలంలోని ఎల్లమ్మతండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో శనివారం సీసీ రోడ్డు పనులను ఎంపీపీ నర్మద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ప్రజలందరూ గ్రామాల్లోని అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మల్లేష్, శ్రీధర్ నాయక్‌తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆమనగల్లు: పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన వారికి ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, కరస్పాండెంట్ సుజాతారెడ్డి, అకాడమిక్ అడ్వైజర్ సుదర్శన్ రెడ్డి, డైరెక్టర్ సావిత్రి, ప్రిన్సిపల్ శ్రీశైలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణ



వెంకట్‌రెడ్డికి డైరీని అందజేస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పోల్కంపల్లి, రాయపోల్, నాగన్‌పల్లితో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. అనంతరం మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డికి డైరీని అందజేశారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలలకు నూతన క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేయాలన్నారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అంజనేయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు నిలిపివేత

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్న నిర్మాణాలను శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ అధికారులు అడ్డుకున్నారు. ఆదిబట్ల, మంగళ్‌పల్లి ప్రాంతాల్లో నిర్మిస్తున్న అధిక అంతస్తుల వద్ద పనిముట్లను మున్సిపాలిటీ అధికారులు తీసుకెళ్లారు. అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

నిర్లక్ష్యం.. బీటీకి శాపం!



షోల్డర్ వర్క్ మాత్రమే పూర్తయిన కడ్తాల్ గుర్లకుంట తండా రహదారి



వర్షకాలంలో తండా రహదారిపై అలుగు వద్ద నీరు పారుతున్న దృశ్యం(ఫైల్)

- పనులు ప్రారంభించి ఏడాది పూర్తి
- వర్షాకాలంలో రాకపోకలకు ఇక్కట్లు
- పనులు పూర్తి చేయాలంటున్న తండావాసులు వేడుకోలు

కడ్తాల్: గుర్లకుంట తండాకు బీటీరోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రయాణ కష్టాలను తీర్చాలని గిరిజనులు ఎంతో ఆశగా ఎదురుగా చూస్తున్నారు. ఏడాది క్రితం పనులు ప్రారంభించినా నేటికి బీటీ వేయకపోవడంతో ప్రయాణ కష్టాలు తప్పడం లేదని తండావాసులు వాపోతున్నారు. రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇదేక్కడో మారుమూల తండా అనుకుంటే పొరపాటే.. రాష్ట్ర రాజధానికి 40 కిలో మీటర్ల దూరంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి సమీపంలో గల కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుర్లకుంటతండా రోడ్డు పరిస్థితి.

వివరాలు పరిశీలిస్తే.. కడ్తాల్–గుర్లకుంటతండా రోడ్డు పనులకు భూమి పూజ చేసి ఏడాది దాటినా.. రోడ్డు నిర్మాణ పనులు ఎక్కడ వేసినా గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. గుర్లకుంట తండాకు వెళ్లాలంటే చెరువుకట్ట మీదుగానే రాకపోకలు సాగించాలి. దీంతో వర్షాకాలంలో తండా నుంచి కడ్తాల్ వెళ్లాలంటే, అనేక ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. తండా ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం 2022 ఏడాది చివరిలో కడ్తాల్ నుంచి గుర్లకుంటతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ నిధులు రూ. 1 కోటి నిధులు మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో 2023 ఏడాది జనవరి మాసంలో అప్పటి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు స్థానిక ప్రజాప్రతినిధులతో నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. పనులు ప్రారంభించిన గుత్తేదారు పనులను వేగవంతంగా చేయకపోవడంతో నేటికీ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో తండా ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.

షోల్డర్ పనుల వరకే పూర్తి..

కేవలం రోడ్డుకు ఇరువైపులా షోల్డర్ వర్క్ పూర్తి చేశారు. పనులు ప్రారంభించిన నాటి నుంచి సకాలంలో పనులు చేసి ఉంటే రాకపోకలు సాఫీగా సాగేవని, ఇబ్బందులు తీరేవని తండావాసులు ఆవేదన చెందుతున్నారు. అలాగే గుర్లకుంట అలుగు వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టి త్వరగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని తండావాసులు కోరుతున్నారు.

పూర్తయితేనే కష్టాలు తీరుతాయి.

బీటీ రహదారి పనులు పూర్తయితేనే మండల కేంద్రంతో పాటు హైదరాబాద్‌కు సాఫీగా రాకపోకలు సాగుతాయని తండావాసులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్ప పనులు ముందుకు సాగడం లేదని తండావాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.

సమస్యను పరిష్కరించండి



రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రయాణ కష్టాలు తీర్చాలి. గత ఏడాది ఎండాకాలంలో రోడ్డు నిర్మాణం కోసమని చెరువు కట్టపైన ఇరువైపులా మట్టి పనులు చేసి..అసంపూర్తిగా వదిలేశారు. తండా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులు పూర్తి చేయాలి

– రాంచందర్‌నాయక్, గుర్లకుంటతండా

వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం



రోడ్డు నిర్మాణ పనులు వారం రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.. కచ్చితంగా వారం రోజుల్లో పనులు ప్రారంభించి, పది నుంచి పదిహేను రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేయడం జరుగుతుంది. బీటీ రోడ్డు పనులు పూర్తి చేసి తండావాసుల సమస్యను పరిష్కరిస్తాం.

– పరమేశ్, పీఆర్‌ఏఈ, కడ్తాల్

అభివృద్ధి పనులకు చేయూత



ఆర్థిక సహాయం అందజేస్తున్న రమేష్ తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి చివరి వారంలో జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రంగులు, మరమ్మతులు, ఉత్సవాలు, తదితర సేవా కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అంబటి రమేష్ శనివారం ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డికి రూ. 50 వేలు అందజేశారు. అనంతరం స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు రమేష్‌ను శాలువాలతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం, చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, అర్చకులు పద్మనాభం, ఆలయ క్లర్క్ ఆంజనేయులు, జంగయ్య, మధు, భిక్షపతి, బాలకృష్ణ, మల్లేష్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి



సంత్ రవిదాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలో సంత్ శిరోమణిగా పేరుగాంచిన సంత్ రవిదాస్ జయంతి వేడుకలను శనివారం ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంత్ రవిదాస్ చిత్రపటానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 14వ శతాబ్దంలో చర్మకారుల కుటుంబంలో జన్మించిన సంత్ రవిదాస్ మూఢనమ్మకాలు, సాంఘిక అసమానతలు, మొగలుల పాలనలో ఆగడాలపై భక్తి ఉద్యమం ద్వారా సమాజాన్ని జాగృతం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్, కల్వకుర్తి ఇన్‌చార్జి కృష్ణ, శివాజీ పరివార్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిరంజన్, నాయకులు జానయ్య, నర్సింహ, లక్ష్మణ్, శ్రీశైలంయాదవ్, శ్రీకాంత్‌సింగ్, రాజు, గణేశ్, మల్లేశ్, శ్రీకాంత్, శివ, కృష్ణ, ఆనంద్ పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డి ఎంపీగా గెలవడం ఖాయం

కాంగ్రెస్ నాయకుడు చెన్నకేశవులు



వంశీచంద్‌రెడ్డిని కలిసిన చెన్నకేశవులు

తలకొండపల్లి: ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడంపై శనివారం కాంగ్రెస్ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు చెన్నకేశవులు హర్షం వ్యక్తం చేశారు. వంశీచంద్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంపై వంశీచంద్‌రెడ్డికి మ ంచి పట్టు ఉందని, ఆయన సేవలు ప్రజలకు అవసరముందన్నారు. ఎంపీగా గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నేత కృష్ణయ్య పాల్గొన్నారు.

మల్లు రవికి నాగర్‌కర్నూల్ టికెట్ ఇవ్వాలి

కాంగ్రెస్ నాయకుడు జంగయ్య



విలేకరులతో మాట్లాడుతున్న జంగయ్య

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లురవిని ప్రకటించాలని జిల్లా గ్రంథాలయ సంస్థల మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ కోసం అహర్నిశలు పని చేస్తున్న మల్లురవికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పదవి ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేస్తూ నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా మల్లురవి పని చేశారని అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా మల్లురవి రెండు పర్యాయాలు పనిచేశారని గుర్తు చేశారు. మల్లురవి సేవలను సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కేశవులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రాములు, మల్లయ్య, యాదయ్య, రాఘవేందర్, రవీందర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాపారంలో తిరుగులేని సంస్థ భారతి సిమెంట్

టెక్నికల్ ఇంజనీర్ మహమ్మద్ సాహెర్



బహుమతులు అందజేస్తున్న సాహెర్

ఇబ్రహీంపట్నం రూరల్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ ఎదుగుతుందని, అల్ట్రాఫాస్ట్ పేరుతో 5 స్టార్ గ్రేడ్‌లో ఉందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మహమ్మద్‌సాహెర్ పేర్కొన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ స్టీల్ ట్రేడర్స్ డీలర్ షాపు వద్ద తాపీ మేస్త్రీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి సిమెంట్ వేగవంతమైందన్నారు. స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు రహదారులకు సరైన ఎంపికని చెప్పారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతిసిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి సిమెంట్ చాలా బాగుంటుందన్నారు. కార్యక్రమంలో డీలర్ సందీప్, డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రాజేశ్వర్‌రెడ్డిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై సత్తా చాటాలి

గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ కోహ్లి



విద్యార్థులను అభినందిస్తున్న వైస్‌చైర్మన్

ఇబ్రహీంపట్నం రూరల్: నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు సత్తా చాటాలని గురునానక్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ గగన్‌దీప్ సింగ్ కోహ్లి పేర్కొన్నారు. కారి మోటార్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో కోయంబత్తూర్‌లో జరిగిన 11వ జాతీయస్థాయి గోకార్ట్ డిజైన్ ఛాలెంజ్ ఈవీ, సీవీ సెగ్మెంట్‌లో మెకానికల్ బ్రాంచ్ తరఫున జాతీయ స్థాయిలో 23 కాలేజీలు పాల్గొనగా అందులో గురునానక్ విద్యా సంస్థల విద్యార్థులు మూడవ స్థానాన్ని , సీవీ సెగ్మెంట్‌లో 44 కాలేజీలు పాల్గొనగా 6వ స్థానాన్ని దక్కించుకున్నాయి. రాష్ట్రం తరఫున మొదటి స్థానంలో నిలిచాయి. శనివారం కళాశాల వైస్ చైర్మన్ గగన్‌దీప్ సింగ్ కోహ్లి, ఎండీ హెచ్‌ఎస్ సైనీలు విద్యార్థులను అభినందించారు.

బీఆర్ఎస్ నాయకులను చేర్చుకోవద్దు

పట్నం కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ కౌన్సిలర్లను తీసుకోవద్దని ఆ పార్టీ నేతలు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. శనివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి తొర్రూర్‌లోని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయానికి వెళ్లాడు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు ఆకుల యాదగిరిని పార్టీలో చేర్చుకోవాలని రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేను కలవడంతో పార్టీ నేతల్లో అలజడి మొదలైంది. వెంటనే కాంగ్రెస్ నాయకులు ముకుమ్మడిగా ఎమ్మెల్యేను కలిశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి పూర్తిగా వ్యతిరేకంగా పని చేశారని, మనపై దాడి చేసిన ఘటనలో ఇతని డ్రైవర్ కీలకంగా వ్యవహరించారని చెప్పారు. అలాగే మరో ఇద్దరు ముగ్గురు కౌన్సిలర్లు సైతం పార్టీలో చేరాలని చూస్తున్నారని తెలిపారు. వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం భయంతోనే పార్టీలో చేరాలని చూస్తున్నాడని అతనిపై అవిశ్వాసం పెట్టి తీరుతామని మనకు కోరం ఉందని ఎమ్మెల్యేకు నేతలు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే కార్యకర్తల అభిప్రాయం మేరకే నిర్ణయం ఉంటుందన్నారు.

ఆడియో కలకలం..

ఎమ్మెల్యేను వ్యక్తిగతంగా కలవడానికి వెళ్లింది వాస్తవమేనని, నేను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను వీడియో ద్వారా ఖండించారు. నాపై కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రచారమని తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత



కడ్తాల్: సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరిస్తున్న ఏఓ శ్రీలత



తలకొండపల్లి: మాట్లాడుతున్న ఏఓ, రైతులు

కడ్తాల్: వరిసాగులో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా, శనివారం మండలంలోని చల్లంపల్లిలో రైతులు సాగు చేసిన వరి పంటలను సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో కాండం తొలుచు పురుగు, ఆకు మచ్చ తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని రైతులకు వివరించారు. ఇందుకు సస్యరక్షణ చర్యలపై దృష్టి సారించాలని, వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరోథనీలిప్రోల్ పెటిరా గుళికలు ఎకరానికి 4 కిలోలు చల్లాలని చెప్పారు. ఆకు ఎండు తెగులు నివారణకు కాపారాక్సి క్లోరైడ్ 600 గ్రాములు, అగ్రోమైసిన్ లేదా, ప్లాంటో మైసిన్ 60 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రమణ, రైతులు ఉన్నారు.

రైతులకు అవగాహన

తలకొండపల్లి: సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడి సాధించాలని ఏఓ రాజు పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాంపూర్‌లో ఏఓ రాజు పర్యటించారు. రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. అనంతరం రైతు వేదికలో వరిసాగు విధానం–చీడ పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. రాత్రి చలి, ఉదయం ఉష్ణోగ్రతలు ఉండడం వల్ల వరిలో కాండం తొలుచు పురుగు చేరుతుందన్నారు. సల్ఫర్ నష్టం పంట పొలాల్లో కన్పించడం జరుగుతుందన్నారు. వీటి నివారణకు పంటలో నీరు తీసి, ఆరబెట్టాలి. ఈ విధంగా వారానికి రెండు సార్లు చేసుకోవాలని తెలిపారు. యూరియా, డీఏపీ, పొటాష్‌లను సమభాగాలుగా నాటిన 10 రోజుల్లో వేయాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫిరాన్, మంకొజెబ్‌లను కలిపి ఎకరానికి 150 గ్రాములు వేసుకోవాలన్నారు. కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ 75 శాతం ఎస్‌జీ ఐదు కేజీలు ఎకరానికి వేసుకోని నివారించుకోవచ్చన్నారు. ఆగ్రోమిన్ మల్టీ న్యూట్రియంట్ ఫర్టిలైజర్‌ను ఎకరానికి 250 గ్రాములు వాడి నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో హరిమోహన్‌రెడ్డి, నరసింహ, శ్రీనివాసాచారి, ఆంజనేయులు, వెంకటేశు, కృష్ణారెడ్డి, పాండురంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

సీపీఎం మండ కార్యదర్శి నర్సింహ

యాచారం: భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారని, ధరణి పోర్టల్‌లో సవరణలు చేసి భూ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి ధరణి పోర్టల్ పూర్తిగా నిలిచిపోయిందన్నారు. రైతుల భూ సమస్యలపై నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు వెంటనే భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే, రైతుబంధు నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

బ్రహ్మోత్సవాలకు రండి



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

తలకొండపల్లి: మండలంలోని వెల్జాల్‌లో వెలిసిన వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు మార్చి 5న ప్రారంభమై 7న ముగియనున్నాయి. శనివారం మాజీ ఉప సర్పంచ్ అజీజ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు కల్వకుర్తిలో మల్లు రవిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామి పెళ్లికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, నర్సింలు, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



మంచాల: కల్యాణోత్సవంలో భాగంగా తలంబ్రాలు పోస్తున్న దృశ్యం



యాచారం: ప్రత్యేక పూజలు చేస్తున్న నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు



కడ్తాల్: కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మంచాల: మండలంలోని ఆరుట్లలో శుక్రవారం రాత్రి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం ఎంతో వైభవంగా నిర్వహించారు. స్వామివారితో రుక్మిణి, సత్యభామలకు కల్యా ణం జరిపించడం చూడముచ్చట సాగింది. ఆరుట్లతో పాటు చుట్టూ పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి కల్యాణం చూసి తరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

యాచారం: మండలంలోని కొత్తపల్లి–తక్కళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. గత నాలుగు రోజులుగా దేవాలయ ఆవరణలో భక్తులు స్వామివారి కల్యాణోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉ.6 గంటలకే స్వామివారి రథోత్సవానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పోటాపోటీగా రథోత్సవాన్ని లాగారు. గోవిందా నామస్మరణలతో దేవాలయ ఆవరణ మార్మోగింది. దేవాలయ నిర్వాహకులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: మండల కేంద్రంలో కొలువై ఉన్న లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శనివారం అర్చకుల మంత్రోచ్చరణలతో లలితా సహస్రనామస్తోత్ర పారాయణం, కుంకుమార్చన , హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని, భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మల్లేశ్‌గౌడ్, బ్రహ్మచారి, ఉత్సవ కమిటీ చైర్మన్‌స్ వేణుగోపాల్, వేద పండితులు వేంకటేశ్వర శర్మ, అర్చకులు శ్రీధర్, శ్రీమన్నారాయణ మహిళా భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

మాడ్గుల: మండలంలోని దిల్వార్‌ఖాన్‌పల్లిలో వెలిసిన నీల భూనీల సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం స్వామివారి కల్యాణం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.